వైఎస్సార్ బీమా నగదు పంపిణీ


బీమా సొమ్మును అందజేస్తున్న సర్పంచ్ హిమబిందు తదితరులు

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ గ్రామానికి చెందిన పల్లికొండ సునీత ఇటీవల మృతి చెందగా ఆమె కుమార్తె హిమబిందుకు గురువారం సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి బీమా సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో వైస్ సర్పంచ్ చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు మలిరెడ్డి కృష్ణారెడ్డి, సరెళ్ల నాగేశ్వరరావు, గ్రామ కార్యదర్శి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు లబ్ధే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ పాలన

పామర్రు శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్


సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందించి సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

జమీగొల్వేపల్లి(పామర్రు): నిరుపేదలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చటమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని పామర్రు శాసనసభ్యుడు కై లే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి గ్రామంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. ప్రతి ఇంటికీ అందిన సంక్షేమ పథకాల లబ్ధి గురించి తెలియజేశారు. జగనన్న నాలుగున్నర ఏళ్ల సంక్షేమ పాలనలో ప్రవేశ పెట్టిన పథకాలను, నవరత్నాల గురించిన కరపత్రాన్ని ప్రజలకు అందించారు. స్థానిక ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరిస్తూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలలో వెలకట్టలేని సంతోషాన్ని నింపుతోందని అన్నారు. ప్రజలకు మంచి చేస్తున్న ప్రభుత్వానికి అండగా ఉండి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆరుమళ్ల రమాదేవి, సర్పంచ్ ఆర్.శాంతకుమారి, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, పి.రత్నకుమారి, వెంకటేశ్వరమ్మ, కారుమంచి నాగమల్లేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు ఎండీ హస్మతుల్లా, పార్టీ నాయకులు పాలడుగు రాంప్రసాద్, వల్లభనేని బుల్లిబాబు, కొల్లి గోపాలకృష్ణ, కాకర్ల వెంకటేశ్వరరావు, బలుసు హరికిరణ్, పామర్తి వెంకట్, కంభపు రాంబాబు, నామా వెంకటేశ్వరరావు, నవుడు సింహాచలం, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆకు కూరలు ఎక్కువగా తీసుకోవాలి

కురుమద్దాలి(పామర్రు): గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలని కురుమద్దాలి గ్రామ సర్పంచ్ గోత్రు విజయభారతి అన్నారు. మండలంలోని కురుమద్దాలి గ్రామ సచివాలయం వద్ద పోషకాహార మాసోత్సవాలలో భాగంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ చిరుధాన్యాలతో కూడిన వంటకాలను తయారు చేసుకుని తినాలని, అప్పుడే రక్తహీనత తగ్గుతుందని అన్నారు. అనంతరం గర్భిణులకు బాలింతలకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయలక్ష్మి, డొక్కు భవాని, దూబా భవాని ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ క్రీడాకారులుగా ఎదగండి

ఎంపీడీఓ విఠల్‌పాల్



పమిడిముక్కల: దేశం గర్వించతగ్గ క్రీడాకారులుగా ఎదగాలని ఎంపీడీఓ విఠల్‌పాల్ విద్యార్థులకు సూచించారు. స్థానిక హైస్కూల్‌లో జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్‌ని గురువారం ఆయన ప్రారంభించారు. క్రీడలు శారీరక, మానసికోల్లాసానికి దోహదపడతాయని తెలిపారు. ఖో–ఖో జూనియర్, సీనియర్ బాల, బాలికల జట్లను ఎంపిక చేశారు. ఎంపికల్లో మొత్తం 100 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేశవనారాయణ, పీడీలు నారాయణ, శ్రీధర్, రవీంద్రబాబు, కుమార్, రమణారావు, వరలక్ష్మి పాల్గొని క్రీడా జట్లను ఎంపిక చేశారు.

శరవేగంగా ఆర్టీసీ బస్టాండ్ అభివృద్ధి పనులు



గుడివాడటౌన్: దశాబ్దాలుగా గుడివాడ ఆర్టీసీ డిపోలో ప్రయాణికులు పడుతున్న కష్టాలు త్వరలోనే తీరనున్నాయి. రూ.8 కోట్లతో నూతన బస్టాండ్ ఏర్పాటు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. తొలిదశలో భాగంగా పాత భవనాలు పూర్తిగా తొలగించే ప్రక్రియ పూర్తయింది. దీంతో అధునాతన హంగులతో 11 ప్లాట్‌ఫారాలతో నూతన బస్టాండ్ నిర్మాణ పనులు వచ్చేవారంలో ప్రారంభిస్తామని డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ తెలిపారు. ఊహించిన దానికన్నా ముందే బస్టాండ్ నిర్మాణం పూర్తవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ముగిసిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు



మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు గురువారం ముగిశాయి. రెండో రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో అండర్–14, అండర్–17 విభాగాల్లో 38 అంశాల్లో క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ఈ నెల 16వ తేదీ నుంచి నియోజకవర్గ కేంద్రం పామర్రులో జరిగే నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. పోటీలను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం పి శివ కోటేశ్వరరావు, మండల స్పోర్ట్స్ అభివృద్ధి అధికారి అప్పికట్ల రామారావు, పీడి మండలి మనోహరిలతో పాటు పలు పాఠశాలల పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్‌ను సద్వినియోగం చేసుకోండి



పమిడిముక్కల: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వీరంకిలాకు పీహెచ్‌సీ వైద్యురాలు సైరా ఖతూన్ రోగులను పరీక్షించారు. వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని రోగులకు సూచించారు. సీహెచ్‌ఓ ప్రియాంక రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. దీర్ఘకాలిక రోగులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌వీ దేవకమలమ్మ, సీహెచ్‌ఓ రమణ, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

పశుపోషకునికి రూ.25 వేల చెక్కు అందజేత



తోట్లవల్లూరు: రైతుల సంక్షేమానికి కేడీసీసీ బ్యాంకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పెనమకూరు పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శ్రీనివాసరావు తెలియజేశారు. గ్రామానికి చెందిన కొల్లిపర వెంకట్రామయ్య ఎద్దు ప్రమాదవశాత్తు ఇటీవల మృతి చెందింది. బాధిత రైతుకు కేడీసీసీ బ్యాంకు ద్వారా రూ.25 వేల చెక్కును కేడీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ తాతినేని పద్మావతి చేతుల మీదుగా గురువారం అందజేసినట్లు ఆయన తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు మరీదు వెంకట శివ మధుబాబు, గరికపర్రు పీఏసీఎస్ అధ్యక్షుడు బోలెం శివనాగమల్లేశ్వరరావు (చంటి), వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, బోలెం వీరబాబు, పీఏసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

కుకింగ్ ఏజెన్సీల సమస్యలు పరిష్కరించాలి

తోట్లవల్లూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.స్రవంతి డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మధ్యాహ్న భోజన కార్మికుల సమావేశం జరిగింది. గత ఇరవై ఏళ్లుగా మధ్యాహ్న భోజన కార్మికులు కుకింగ్ ఏజెన్సీలు నిర్వహిస్తున్నారని, ధరల పెరుగుదలకు అనుగుణంగా వారికి చార్జీలు చెల్లించటం లేదన్నారు. వెంటనే ధరలు పెంచాలని కోరారు. ఈ సందర్భంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గౌసియాబేగం, కార్యదర్శిగా అబ్దుల్ జుబేదా బేగం, సహాయ కార్యదర్శిగా వరదానమ్మ, కోశాధికారిగా కల్పనను ఎన్నుకున్నట్లు స్రవంతి తెలియజేశారు.

ఈఓపీఆర్డీ బాధ్యతల స్వీకరణ

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండల ఈఓపీఆర్డీగా సూరపనేని నవరత్నం గురువారం బాధ్యతలు చేపట్టారు. పులిగడ్డ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై తోట్లవల్లూరు ఈఓపీఆర్డీగా వచ్చారు. ఎంపీడీఓ తుంగల స్వర్ణలతను ఈఓపీఆర్డీ నవరత్నం మర్యాదపూర్వకంగా కలుసుకుని బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఈఓపీఆర్డీగా పనిచేసిన రవికాంత్ ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా ఎ.కొండూరుకు బదిలీ అయ్యారు.